## క్లుప్తంగా

### నేడు సీతారాముల కల్యాణోత్సవం

కల్లూరు: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఉలిందకొండలో ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు లక్ష్మీనారాయణ శర్మ, వేద పండితులుడు ప్రతాప్ శర్మ తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకం, 9 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7గంటలకు సీతారాముల వారి పట్టాభిషేకం, సాయంత్రం పల్లకీలో గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

### పాణ్యంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని వినతి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాణ్యం: పాణ్యం రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్‌తో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు, స్థానికులు గుంతకల్ డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాకు వినతిపత్రం అందించారు. శనివారం గుంతకల్లు, డోన్–నంద్యాల డబ్లింగ్ పనులను పరిశీలించేందుకు వచ్చిన డీఆర్‌ఎంను వారు కలిశారు. పాణ్యం రైల్వేస్టేషన్ సమీపంలో అనేక పరిశ్రమలు, పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. అధిక సంఖ్యలో ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారన్నారు. పాణ్యం రైల్వేస్టేషన్‌లో గుంటూరు–ఔరంగాబాద్, కాచిగూడ–గుంటూరు రైళ్లను ఆపాలని విజ్ఞప్తి చేశారు. వినతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఎం తెలిపారు.

### 8 నుంచి అల్లాబకాష్ ఉరుసు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని హజరత్ అల్లా బకాష్ మియ్యా వలీ ఉరుసును ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా గురువులు ఎస్‌ఎండీ మహబూబ్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి గురువుల ఇంటి నుంచి మేళతాళాలతో పూల చాందినీ, గంధంను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 9న మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, రాత్రి ఉపన్యాసములు, భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 10వ తేదీ ఉదయం జియారత్ పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

### భక్తి శ్రద్ధలతో బడేషా ఖాద్రీ ఉరుసు



భక్తజనం మధ్య స్వామి గంధోత్సవం

సి బెళగల్: మండలంలోని గుండ్రేవుల గ్రామంలో బడేషా ఖాద్రీ ఉరుసును అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలను తిలకించేందుకు శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చదివించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా గంధోత్సవ కార్యక్రమం వైభవంగా సాగింది. ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

**ఇనగండ్లలో..**

మండలం పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో కూడా బడేషా ఖాద్రీ ఉరుసును స్థానికులు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం ఊరి చివర ఉన్న స్వామి దర్గాకు భక్తులు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

### 19న రన్ ఫర్ జీసస్ ర్యాలీ

కర్నూలు (టౌన్): ఈనెల 19న నగరంలో నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ ర్యాలీని విజయవంతం చేయాలని సిటీ పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ చైర్మన్ రెవరెండ్ ఆర్ ఆర్ జి.సజీవరాజు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక రాక్ వుడ్ చర్చిలో గుడ్‌ఫ్రైడ్ , ఈస్టర్ పండుగలను పురస్కరించుకొని ఈవాంజిలికల్ సోల్జర్స్ టీమ్, సిటీ పాస్ట ర్స్, స్థానిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ టీషర్టులను ఆవిష్కరించారు. కన్వీనర్ దాసరి సుధీర్ మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు కోల్స్ చర్చి నుంచి రన్ ఫర్ జీసస్ ర్యాలీ ప్రారంభమై మౌర్య ఇన్, రాజ్‌విహార్, కలెక్టర్ ఆఫీసు మీదుగా సీ.క్యాంపు ప్రార్థన మందిరం వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో రాక్‌వుడ్ సంఘం అధ్యక్షుడు ఆనందరావు, సిటీ పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి దాసుబాబు, సంఘకాపారులు జీవన్, పాల్ ఆగస్టీన్, కిషోర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనీయులు బాబూ జగ్జీవన్‌రామ్

- మాజీ ఉప ప్రధాని జయంతి వేడుకల్లో వక్తలు





ఆర్‌ఎస్ రోడ్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, గూడూరులో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

కర్నూలు(రూరల్): బడుగు,బలహీనవర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులని వక్తలు కొనియాడారు. శనివారం ఆయన జయంతి వేడుకలను పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని గార్గేయపురంలోని సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ పురుషోత్తం ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. అణగారిన వర్గాలకు జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అర్.ఎసేపు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- గార్గేయపురం సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి డి.సి. మదారి మాట్లడుతూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు



ఓర్వకల్లు: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తిప్పన్న మాట్లాడుతూ.. అనగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి చేసిన సేవలు మరువలేనివన్నారు.

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో జగ్జీవన్‌రామ్ జయంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలు అందించారని తెలిపారు. ఆయన మార్గం అనుసరనీయమన్నారు.

కల్లూరు: దివంగత మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 31వ వార్డు శరీన్‌నగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ ఐక్య సమితి ఆధ్వర్యంలో శరీన్‌నగర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి కమిషనర్ రవీంద్ర బాబు నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పుష్పాంజలి ఘటించారు.

కోడుమూరు రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా.జగ్జీవన్‌రామ్ అని కోడుమూరు గ్రామ సర్పంచు భాగ్యరత్న అన్నారు. కోడుమూరులోని పాతబస్టాండ్ సెంటర్‌లో పంచాయతీ సిబ్బంది, ఎమ్మార్పీఎస్, సీపీఎం నాయకులతో కలిసి సర్పంచ్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు చేశారన్నారు. అత్యున్నత మంత్రి పదవులను అలంకరించి పేద ప్రజల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. నేటి యువత ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గఫూర్‌మియ్యా, వీరన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు అంథ్రయ్య, నాగేష్, రాజు, వార్డుమెంబర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గూడూరులో..**

గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్నలు కౌన్సిలర్లు మద్దిలేటి, కుమార్, కిశోర్, దస్తగిరి తదితరులు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఉప ప్రధాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్, ప్రభాకర్, జిలానీ, శివ, మణిరాజు తదితరులు పాల్గొన్నారు.



గార్గేయపురంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సచివాలయం సిబ్బంది



కల్లూరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి




పాణ్యంలో..



కోడుమూరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్పంచు భాగ్యరత్న

### కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కోనా వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అర్చకులు అభిషేక పూజలు చేసి ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. స్థానికులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు కొండపై భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : ఈనెల 14, 15 తేదీల్లో అనంతపురం పోలీసు ట్రైనింగ్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటాలని రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జట్లకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడగా గుర్తింపు పొందిన రగ్బీలో రాణిస్తే భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొని అభినందించారు. ఈ కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు మహబూబ్ సుభానీ, నాగేషు, రాఘవేంద్ర, రవి, కిరణ్, సువర్ణ, నాగ శ్రీనివాసులు, అమృత పాల్గొన్నారు.

## నేడు శ్రీసీతారాముల కల్యాణం

కోడుమూరు రూరల్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని నేడు సీతారాముల కల్యాణ మహోత్సవం జరుగనుంది. ఈ వేడుకలకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పట్టణంలోని శ్రీరాములవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు రాములోరి కల్యాణానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. మండలంలోని వర్కూరులో వెలసిన శ్రీరాములవారి ఆలయంలో ఆదివారం ఉదయం శ్రీసీతారాముల కల్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. అలాగే మండలంలోని క్రిష్టాపురం, అమడగుంట్ల, పులకుర్తి, బైన్‌దొడ్డి గ్రామాల్లోనూ శ్రీరామనవమి వేడుకలు పెద్ద ఎత్తున జరుగనున్నాయి.

**అమడగుంట్లలో ఎద్దుల పోటీలు**

శ్రీరామనవమి సందర్భంగా అమడగుంట్ల గ్రామంలో ఈనెల 7వ తేది ముగ్గుల పోటీలు, ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈనెల 8వ తేదీన గ్రామంలోని సవారమ్మ గుడి దగ్గర ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీల్లో గెలుపొందిన వారికి దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.



శ్రీసీతారామ లక్ష్మణుల మూలవిరాట్‌లు

## రైతు బజార్‌లో దళారీల ఏరివేతకు సహకరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మూడవ పట్టణ సీఐ శేషయ్య

కర్నూలు(అగ్రికల్చర్): రైతుబజారులో దళారీలు ప్రవేశించి ఇటు రైతులకు, అటు వినియోగదారులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు మూడో పట్టణ సీఐ శేషయ్య హెచ్చరించారు. దళారీలను నియంత్రించేందుకు రైతుబజారులో ఇద్దరు పోలీసులు బందోబస్తుగా ఉంటారని తెలిపారు. గత నెల 27న సాక్షిలో 'రైతుబజారులో దళారీల ఇష్టారాజ్యం' శీర్షిక కథనం ప్రచురితమైంది. ఈ కథనం వచ్చిన తర్వాత రైతుబజారు ఎస్టేటు అధికారి మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితలను కలసి రైతుబజారులో దళారీల సమస్య పెరిగిపోయిందని, వీరిని నియంత్రించేందుకు సహకరించాలని కోరారు. ఈ నేపథ్యంలో మంత్రి టీజీ భరత్ మూడో పట్టణ పోలీసులకు రైతుబజారులో దళారీల ఏరివేతకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో శనివారం సి.క్యాంపు రైతుబజారులో రైతులు, వినియోగదారులు, పొదుపు మహిళలతో సీఐ సమావేశం నిర్వహించి దళారీలకు హెచ్చరికలు జారీ చేశారు. అంతకు ముందు రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి . 90 మంది దళారీల పేర్లను సీఐకి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రకాశ్‌రావు, ఎస్టేటు ఆఫీసర్ కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తవ్వకాలపై దాడులు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామ రెవెన్యూ పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలపై అటవీ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారి ఓబులేసు తెలిపిన వివరాల మేరకు.. లొద్దిపల్లె రెవెన్యూ పరిధిలో 105 సర్వేనంబర్‌లో కొంత కాలం నుంచి మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిసిందన్నారు. శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించగా యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. అటవీశాఖ భూముల్లో మట్టి తవ్వకాలు జరపడానికి ఎవరు అనుమతిచ్చారని? మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిని ప్రశ్నించారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వెంటనే నాలుగు ట్రాక్టర్లు, జెసీబీని సీజ్ చేసి ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా మట్టి తవ్వకాలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఓ హెచ్చరించారు.



మట్టి తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీని పట్టుకున్న అధికారులు

## కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం

పాణ్యం: మండల పరిధిలోని ఎస్.కొట్టాల గ్రామంలో హజరత్ దస్తగిరి ఉరుసు సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు శనివారం తెల్లవారుజామున ముగిశాయి. గుజరాత్ జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజుల పాటు కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 20 జట్లు వచ్చాయి. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి క్రీడాభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొదటి బహుమతి రూ. 40 వేలును గుజరాత్ కైవసం చేసుకంది. రెండో బహుమతి తమిళనాడు రూ.30 వేలు, మూడో బహుమతి విజయనగరం రూ. 20 వేలు, నాల్గో బహుమతి చిత్తూరు రూ. 15వేలు, ఐదో బహుమతి ఉత్తరాఖండ్ రూ.10 వేలు, ఆరో బహుమతి కేరళ రూ. 8వేలు, ఏడో బహుమతి తాడిపత్రి రూ. 6వేలు, ఎనిమిదో బహుమతి అనంతపురం జట్టు రూ. 4 వేలు అందుకున్నాయి.



విజేతగా నిలిచిన గుజరాత్ జట్టు

## నిలిచిన పనులు.. తప్పని అవస్థలు

- ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో చివరి దశ పనులు
- ఎప్పటికి పూర్తి చేస్తారో అంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ఆర్వోప్లాంట్, రంగులు, కాంపౌండ్ వాల్ నిర్మిస్తే పనులు పూర్తి



వరండాలోనే ఉన్న హెడ్ మాస్టర్ బీరువా, రికార్డులు, రిజిస్టర్లు



నిర్మాణంలో చివరి దశలో ఉన్న తడకనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల






వరండాలోనే నిర్వహిస్తున్న తరగతులు

కల్లూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసింది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరికరాలు, సిబ్బందిని నియమించి మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేసింది. అయితే పలు పాఠశాలల్లో చివరి దశలో ఉన్న పనులను కూడా కూటమి ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో గదుల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

- తడకనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 188 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు 24 మంది ఉన్నారు. మొత్తంగా 212 మంది ఉన్నారు. అయితే తరగతి గదులు మాత్రం కేవలం ఐదు ఉన్నాయి. హెడ్‌మాస్టర్‌కు ప్రత్యేక గది లేదు. బయట వరండాలోనే బీరువా, రికార్డులు, రిజిస్టర్లు పెట్టుకోవాల్సి పరిస్థితి. ఉపాధ్యాయులకు స్టాఫ్ రూమ్ లేదు. పది తరగతులకు కేవలం ఐదు గదలు ఉండడంతో పాఠాలు అర్థం కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతులను వరండాలో నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు నేడు పథకం కింద స్థలం కేటాయించి నూతనంగా బిల్డింగ్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటి వరకు పాఠశాల ప్రారంభానికి నోచులేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం బిల్డింగ్‌కు ఆర్వో ప్లాంట్, రంగులు ( కలర్స్ ) వేసి అప్రోచ్ రోడ్డు వేస్తే విద్యార్థులు పాఠశాలలో చేరవచ్చు.

**మారిన పాఠశాల రూపురేకలు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ నాణ్యమైన విద్య అందించాలని తపనతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. పిల్లల చదువులతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడకూడదని అమ్మ ఒడి పథకం కింద ఏడాదికి రూ. 15వేలు బడికి వెళ్తున్న ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో జమ చేశారు. విద్యార్థులకు బ్యాగ్, పుస్తకాలు, బెల్ట్, షూస్, నోటు పుస్తకాలు మొదలగు వస్తువులు అందించారు. ప్రతి తరగతిలో విద్యార్థులు కుర్చోవడానికి బెంచీలు, లైట్లు, ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు. కార్పొరేట్ స్కూల్‌లకు ధీటుగా పాఠశాలలను తీర్చిదిద్దారు.

**కల్లూరులో పరిస్థితి ఇలా**

మండలంలో మొదటి విడత కింద 30 పాఠశాలలను మనబడి నాడు నేడు పథకం కింద ఎంపిక చేసి మౌలిక వసతులు కల్పించారు. రెండో విడతలో 54 పాఠశాలలు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో అన్ని రకాల పనులు చివరి దశలో ఉన్నాయి. కేవలం ఆర్వో ప్లాంట్లు, రంగులు (కలర్స్ ), కాంపౌండ్ వాలు పనులు పూర్తయితే పనులు ముగుస్తాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసింది. అయితే చివరి దశలో నిలిచిన పనులకు రూ.14 కోట్లు మంజూరు చేసినట్లు విద్యా అధికారులు పేర్కొన్నారు.

**నూతన పాఠశాలను ప్రారంభించాలి**



గ్రామంలోని పాఠశాలలో ఉన్న ఐదు గదుల్లో అన్నీ తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి నూతనంగా నిర్మించిన పాఠశాలను ప్రారంభించాలి.

–సోమన్న యాదవ్, తడకనపల్లె

**పాఠాలు అర్థం కావడం లేదు**



విద్యార్థులకు తరగతుల వారీగా ప్రత్యేక గదులు ఉంటే పాఠాలు సులభంగా అర్థమవుతాయి. ఇప్పుడు ఉన్న పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు కేవలం ఐదు గదులు మాత్రమే ఉండడంతో ఒక తరగతి పాఠం వేరోక తరగతి విద్యార్థులకు వినిపిస్తోంది. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పినా పిల్లలకు అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి నూతన పాఠశాలను ప్రారంభించాలి.

–రాముడు, తడకనపల్లె

**త్వరలో పనులు ప్రారంభిస్తాం**



మనబడి నాడు నేడు పథకం రెండో విడతలో మండల వ్యాప్తంగా 54 పాఠశాలలు ఎంపిక య్యాయి. ఆయా పాఠశాలల్లో అన్ని రకాల పనులు చివరి దశలో ఉన్నాయి. కేవలం ఆర్వో ప్లాంట్, రంగులు (కలర్స్ ), కాంపౌండ్ వాల్‌లు నిర్మించాలి. ప్రభుత్వం పాఠశాలలకు రూ. 14 కోట్లు కేటాయింది. అన్ని పాఠశాలలో త్వరలో పనులు ప్రారంభిస్తాం.

–శ్రీనివాసులు, ఎంఈఓ, కల్లూరు

## ప్రతి ఒక్కరూ మానవత్వం చూపాలి

- మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు

కర్నూలు కల్చరల్: సకల జీవుల పట్ల ప్రతి ఒక్కరు మానవత్వం కలిగి ఉండాలని శ్రీ భగవాన్ సత్య సాయి బాబా బోధించారని, తన సత్యసాయి రామాయణంలో పేర్కొన్నారని మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు చెప్పారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నెహ్రూనగర్‌లోని సత్యసాయి కళాక్షేత్రంలో మహా సహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం ఏర్పాటు చేశారు. 'శ్రీమద్ రామాయణం' (మానవతా విలువలు– వ్యక్తిత్వ వికాసం) అనే అంశంపై గరికపాటి ప్రవచనం చెప్పారు. సీత, ఊర్మిళ ఆదర్శవంతులైన స్త్రీమూర్తులన్నారు. సమాజంలో ఎప్పుడైతే పాపాలు చేసేవారు పూర్తిగా తగ్గిపోతారో అప్పుడే భారతం, రామాయణం, భాగవతం లాంటివి అంతర్ధానమవుతాయన్నారు. ప్రతి రోజు తెల్లవారు జామున సూర్యోదయాన్ని వీక్షించిన వారిలో ఆత్మస్థైర్యం మెండుగా ఉంటుందని, ఆత్మహత్యల జోలికి వెళ్లరన్నారు. కష్టాలను, బాధలను ఓర్చుకొని నిలబడిన వారు జీవితంలో ఎప్పటికైనా విజేతలు అవుతారన్నారు. క్లబ్, పబ్ కల్చర్‌కు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. చెడును కలిగించే ప్రాంతాలకు వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ సతీమని టీజీ రాజ్యలక్ష్మి, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు డి.కృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షుడు సాయి బాబ, జిల్లా సేవాదల్ బాధ్యులు లక్ష్మీ సరోజ, యూత్ మహిళా కోఆర్డినేటర్ గీతావాణి, సభ్యులు సూర్యనారాయణ రెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గరికపాటి